

కడసారి చూస్తూ..కన్నీళ్లు పెడుతూ!

'మమ్మీడాడీ ఒక్కసారి మాట్లాడండి. మమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నారా డాడీ..!. మేమెలా బతికేది నాన్నా. మాకు దిక్కెవరు అమ్మా..!' అంటూ విగత జీవులుగా ఇంటికి చేరిన తల్లిదండ్రులను చూసి ఆ పసిహృదయాలు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరుల మనసును మెలిపెట్టింది. తల్లిదండ్రులను కడసారి చూసి దిక్కులు పిక్కటిల్లేలా రోదించిన తీరు కన్నీళ్లు తెప్పించింది. ఈ ఘటన సైదాపురంలో శుక్రవారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

మేమెలా బతికేది?
- అమ్మా..ఒక్కసారి మాట్లాడు!
- గుండెను మెలిపెట్టిన కుమార్తెల మాటలు!
- తల్లిదండ్రుల మృతదేహాలను చూసి తల్లడిల్లిన పసి హృదయాలు
- సైదాపురంలో విషాద ఛాయలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


తల్లిదండ్రులకు టాటా చెబుతున్న వైష్ణవి

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గురువారం సైదాపురం–తిప్పవరపాడు మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురానికి చెందిన దొడ్డగా మునెయ్య, భార్య జ్యోతి అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తె వైష్ణవి రక్తగాయాలతో బయటపడింది. ఈ క్రమంలో శుక్రవారం సైదాపురంలో మృతదేహాలకు అంతిమ వీడ్కోలు పలికారు.

కంటతడి పెట్టించిన కుమార్తెల మాటలు
కళ్లెదుటే తల్లిదండ్రులు విగత జీవులుగా పడి ఉండడంతో ఆ పసి హృదయాలు తల్లడిల్లిపోయాయి. 'అమ్మా..నాన్నా.. ఒక్కసారి మాట్లాడండి' అంటూ వారిపై పడి గుండెలు బాదుకోవడం అక్కడి వారిని కలచివేసింది. గాయపడిన వైష్ణవి చివరగా తల్లిదండ్రుల అంతిమయాత్రలో టాటా చెప్పడం స్థానికులకు కన్నీళ్లు తెప్పించింది.

గోకుల బృందావనంలో పుట్టి..
మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోనే ఉన్న గోకుల బృందావనం గ్రామంలో దొడ్డగ మునెయ్య జన్మించారు. ఆయనకు అన్నలు భాస్కర్, చంద్రయ్య ఉన్నారు. వారంతా గోకులబృందావనం గ్రామం వీడి సైదాపురానికి చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. మునెయ్యకు పెళ్లి చేసి సైదాపురంలోనే ఇల్లు కటించి బాగోగులు చూసుకునే వారు. ఈ క్రమంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునెయ్యతోపాటు భార్య జ్యోతి మరణించడంతో విషాదంలో మునిగిపోయారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డలను వదిలివెళ్తున్నారా..! అంటూ కన్నీరుమున్నీరయ్యారు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రెవెన్యూ పని తీరుపై ఆర్డీఓ అసహనం


మండిపడుతున్న ఆర్డీఓ రామ్మోహన్

చంద్రగిరి: మండలంలో రెవెన్యూ అధికారుల పనితీరుపై ఆర్డీఓ రామ్మోహన్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశమయ్యారు. భూ సమస్యలు, రెవెన్యూ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా, గ్రావెల్ దందా, ఇసుక డంపులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై ఆయనకు ఫిర్యాదులు అందాయి. వాటికి సంబంధించి సిబ్బంది నుంచి వివరాలు కోసం ఆరాతీశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆయన మండిపడ్డారు. ఇంతలో ఓ వీఆర్‌ఓ తహసీల్దార్ అనుమతులు ఇచ్చారంటూ తెలపడంతో, ఆయనకు ఫోన్ చేసి వివరాలను కనుక్కోమని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ స్పందిస్తూ అనుమతుల గడువు ముగిసినట్లు తెలపడంతో 'మీరు ఏ మాత్రం పనిచేస్తున్నారో తెలుస్తోంది' అంటూ ఆగ్రహించారు. నాగయ్యగారిపల్లిలో ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. తాను ప్రతి వారం ఆకస్మిక తనిఖీ చేస్తానని, అధికారుల పనితీరులో అలసత్వం కనిపిస్తే ఉపేక్షించేంది లేదని ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

అత్త దారుణ హత్య


మృతి చెందిన ప్రమీలమ్మ

తిరుపతి క్రైం : నగదు కోసం అత్తను దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వెస్ట్ సీఐ మురళీమోహన్, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రావారిపాళెం మండలం, బండమీద కమ్మపల్లికి చెందిన ప్రమీలమ్మ(60) తన భర్త గోపాల్‌రెడ్డితో కలిసి గత 30 ఏళ్లుగా తిరుపతిలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉండేది. ఈ మధ్య కాలంలో ప్రమీలమ్మ చింతకాయల వీధిలో పాచి పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఆమె భర్త మేస్త్రి పనిచేసుకుంటూ పీపీ చావడిలో నివాసముండేవాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం డెంటల్ హాస్పిటల్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న ఆమె చిన్న కూతురు రోజా వద్దకు వెళ్లింది. కుమార్తె డ్యూటీలో ఉండడంతో కోలా వీధిలోని చిన్న గుంటలో ఉన్న ఇంటి తాళాలను వారి అమ్మకి ఇచ్చి పంపించింది. దీంతో ఇంటికి వెళ్లిన ప్రమీల అక్కడ ఏమైందో ఏమో గానీ రోజా వచ్చి చూసే సరికి నోట్లో రక్తం వచ్చి కింద పడిపోయి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఇదిలా ఉంటే చుట్టుపక్కల స్థానికులు మాత్రం రోజా రెండవ భర్త రవినాయక్(డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు) అత్త ప్రమీలతో నగదు కోసం గొడవపడి.. ఈ దారుణానికి పాల్పడ్డారని తెలిపారు. గొంతు నిలిమి చంపి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆమె వద్ద ఉన్న నగదు కోసమే హత్య చేసి ఉంటాడని చెబుతున్నారు.

మందుబాబుల వీరంగం


గాయపడ్డ ముని

తడ: మద్యం కోసం కలిసి వచ్చి, మత్తు ఎక్కాక ఓ మిత్రుడు మరో మిత్రుని తలపై బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటన తడలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. వరదయ్యపాళెం మండలం, పులివెల్లం గ్రామానికి చెందిన ముని సమీప గ్రామానికి చెందిన వినోద్‌తో కలిసి తడలో శ్రీకాళహస్తి మార్గంలో ఉన్న మద్యం దుకాణానికి వచ్చారు. అక్కడ మద్యం సేవించి మత్తులో ఉన్న వినోద్ సమీపంలో ఉన్న ఖాళీ బీరు బాటిల్‌తో ముని తలపై కొట్టాడు. భయపడ్డ వినోద్ అక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఎస్సీవీ నాయుడు విమర్శలు విడ్డూరం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నేత కందారపు మురళి

తిరుపతి కల్చరల్: ఓటేరు చెరువు కబ్జాను అడ్డుకున్న వామపక్ష నేతలపై మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అనుచిత వ్యాఖ్యాలు చేయడం విడ్డూరమని వామపక్ష, ప్రజాసంఘా నేతలు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పీఐ దక్షిణాది అధ్యక్షుడు పి.అంజయ్య, రైతు సంఘ నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా నేత కందారపు మురళి మాట్లాడారు. ఓటేరు చెరువును కబ్జాను కమ్యూనిస్టు నేతలుగా తాము పరిశీలించి అడ్డుకోవడం జరిగిందన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని డిమాండ్ చేశామన్నారు. అయితే శ్రీకాళహస్తికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆ భూమి తనదని, కమ్యూనిస్టులు తన చుట్టూ తిరిగారని అనుచిత వ్యాఖ్యాలు చేయడం తగదన్నారు. తక్షణం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గంజాయి బ్యాచ్ అరెస్ట్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అర్బన్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట పోలీసుల కథనం మేరకు.. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో శుక్రవారం అర్బన్ సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ బాలుర హైస్కూల్ పక్కన హిందూ శ్మశాన వాటిక వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న వినాయక్ నగర్‌కు చెందిన కాజేరిరాజు(21), పాంచాలి నగర్‌కు చెందిన కాజేరి రాము(20), రాము మదన్ (21), అడపాల సాయిప్రసాద్ (27), ఏఎస్ఆర్ కాలనీకి చెందిన గురవయ్య(20)ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై వారి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై పలు కేసులు నమోదు చేసి తిరుపతి కోర్టులో హాజరు పరచగా.. జడ్జి రిమాండ్ విధించారు.

ఆరుగురికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఆరుగురికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీల ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ మేరకు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

నూతన ట్రాఫిక్ చట్టాలపై అవగాహన

తిరుమల: తిరుమలలో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నూతన ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా తిరుమలలో సరైన డాక్యుమెంట్లు లేని 41 వాహనాలను గుర్తించి వారికి రూ.41,000 వరకు జరిమానా విధించారు. ఇద్దరు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా వారికి కోర్టు ద్వారా జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ నూతనంగా వచ్చిన చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు.

గందరగోళం.. దా'రుణం'!


ఇంటర్వ్యూల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, బీసీ, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు అందిస్తున్న రుణాల ఇంటర్వ్యూల్లో గందరగోళం నెలకొంది. శుక్రవారం ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు అధికారులు, బ్యాంకర్లు సంయుక్తంగా ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలంలోని ఏడు బ్యాంకులకు 68 యూనిట్లను టార్గెట్‌గా ప్రభుత్వం కేటాయించింది. రుణాల కోసం వచ్చిన లబ్దిదారులకు ఇంటర్వ్యూలకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయలేదు. ఇదిలావుండగా మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా చంద్రగిరి ఎస్‌బీఐ, ఎస్‌బీఐ(ఏడీబీ), బీఓఐ బ్యాంకుల అధికారులు హాజరు కాలేదు. 562 మంది దరఖాస్తుదారులకు గాను 450 మంది హాజరు కాగా, 112 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నానికి ఇంటర్వ్యూలను మమ అనిపించారు.

వెనక్కి ఇచ్చేసిన బ్యాంకర్లు
రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న కొంత మంది లబ్ధిదారుల దరఖాస్తు ఫారాలను తిరిగి ఇచ్చేయడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ దరఖాస్తులు తమ బ్యాంకుకు సంబంధం లేదంటూ సంబంధిత అధికారులు తేల్చిచెప్పారు. దీంతో చేసేది లేక లబ్ధిదారులు నిట్టూర్పులు వెళ్లగక్కుతూ ఇళ్లకు చేరారు.

భారీగా ఎర్రచందనం స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్


ఎర్రచందనంతో పాటు స్మగ్లర్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : కడప జిల్లా బద్వేలు అటవీ ప్రాంతంలో రూ.35 లక్షల విలువ చేసే 34 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ జీ.బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పీ.నరేష్ టీమ్ శుక్రవారం బద్వేలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. సి.రామాపురం సమీపంలో ఎద్దులబోడు వద్ద రెండు మోటారు సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు కనిపించారు. వీరు టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దాంతో సిబ్బంది వెంబడించి వారిని పట్టుకున్నారు. ఆ చుట్టుపక్కల పరిశీలించగా 34 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని కడప జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారి నుంచి మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం దుంగలతో సహా స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ రూ.35 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఫీ తెలిపారు.

జాతీయ స్థాయిలో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ


అవార్డు అందుకుంటున్న ఎస్వీయూ బృందం


ప్రతిభ చాటిన మహిళా వర్సిటీ బృందం

తిరుపతి సిటీ: ఉత్తరప్రదేశ్ నోయిడాలోని అమిటీ యూనివర్సిటీ వేదికగా ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వర్సిటీ కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఆచార్య మురళీధర్ నాయకత్వంలోని వర్సిటీ విద్యార్థుల బృందంలోని ప్రతిభ చూపిన వారిలో మోడలింగ్ విభాగంలో కె.తేజ ప్రథమ స్థానం, ఇన్‌స్టలేషన్‌లో ఆర్.మౌనిక, డి.దేవా రెండో స్థానం, మెహందీలో ఎస్ సంధ్య, దీప్తి రెండో స్థానం, రంగోలిలో వీరాంజనేయులు రెండో స్థానం, పోస్టర్ మేకింగ్‌లో దేవా మూడో స్థానం సాధించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, అధ్యాపకులు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

సత్తాచాటిన మహిళా వర్సిటీ విద్యార్థినులు
నోయిడా యువజనోత్సవాలలో పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఫైనార్ట్స్ విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కల్చరల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి ఆధ్వర్యంలో పోటీలలో పాల్గొన్న విద్యార్థుల బృందం పలు విభాగాలలో సత్తా చాటింది. ప్రధానంగా మైమ్స్ విభాగంలో ప్రత్యూష, మౌనిక, భాను, చంద్రజ్యోతి, మీనాభాను, శివాని, కీర్తి సత్తా చాటగా, స్కిట్ విభాగంలో నీలిమ, సత్య భార్గవి, సువర్ణేశ్వరి, సాత్విక, నిహారిక విజేతలుగా నిలిచారు. విద్యార్థినులను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు అభినందించారు.

ఆశీస్సులు అందించు గోవిందా!


మోకాళ్లపై మోకరిల్లి శ్రీవారిని ప్రార్థిస్తున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి కల్చరల్: 'మేము చేస్తున్న న్యాయ పోరాటానికి ఆశీస్సులు అందించు స్వామీ' అంటూ వెటర్నరీ విద్యార్థులు శుక్రవారం అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి తిరుమల వెంకన్నను ప్రార్థించారు. స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ వెటర్నరీ విద్యార్థులు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో 33వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా అలిపిరి పాదాల మండపం వద్ద విద్యార్థులు పూజలు చేసి మోకాళ్లపై కూర్చొని స్వామివారి ప్రార్థిస్తూ వేడుకున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి

సాక్షి, టాస్క్ ఫోర్సు: గూడూరు సబ్‌కలెక్టరేట్ ఆవరణలో ఓ మహిళ తనకు న్యాయం చేయాలని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రి పాలైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొడవలూరు మండలం, రావూరు గ్రామానికి చెందిన ఆమె చిల్లకూరు మండలం, ఏరూరు గ్రామంలో బంధువుల వద్ద మూడు ఎకరాల భూమిని పదేళ్ల క్రితం కొనుగోలు చేసింది. ఈ భూమిని తన పేరు మీద రికార్డుల్లో మార్చాలని రెవెన్యూ అధికారులకు విన్నవించింది. ఆ భూమి చుక్కల భూమిగా నమోదైందని చెప్పడంతో ఆమె మరొకరికి లీజుకు ఇచ్చింది. ఈ క్రమంలో ఇటీవల ప్రభుత్వం చుక్కల భూములను తొలగించడంతో ఆమె కొనుగోలు చేసిన భూమిని కూడా విడుదల చేశారు. ఆ సమయంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిని మరొకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఆమె తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో సబ్ కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- టాటా ఏసీ వాహనం ఢీకొని ఇద్దరు వలస కూలీల మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన కార్మికుడు తిరుపాల్


ఘటనా స్థలంలో రమణమ్మ మృతదేహం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)/ పెళ్లకూరు: పొట్ట కూటి కోసం వలస వచ్చిన కూలీల పైకి టాటా ఏసీ వాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం.. రేణిగుంట మండలం, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సమీపంలోని నాయుడుపేట– పూతలపట్టు జాతీయ రహదారి, యోగానంద కాలేజీ నూతన ఫ్లైఓవర్ బ్రిడ్జి పై కూలీలు రమణమ్మ, తిరుపాల్, సరోజమ్మ, సక్కమ్మ, శైలజ పనిచేస్తున్నారు. అదే సమయంలో ఓ టాటా ఏసీ వాహనం వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రమణమ్మ(41), తిరుపాల్(50) మృతిచెందారు. మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

-12 మంది గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి కొత్తూరు గ్రామ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 12 మందికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. రోడ్డు అభివృద్ధి పనుల చేసే కూలీలను తరలించే ట్రాక్టర్ కొత్తూరు గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆపి ఉంచారు. తిరుపతి నుంచి కర్నూలు, శ్రీశైలం వెళ్లే గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 12 మందికి గాయాలయ్యాయి. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను నాయుడుపేటకు తరలించారు. వీరిలో తీవ్ర గాయాలైన పెమ్మసాని పద్మ, సుబ్బరాజు, నాగరత్నమ్మను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పంబలేరు కాలువలో గుర్తుతెలియని మృతదేహం


నీటిలో తేలియాడుతున్న వ్యక్తి మృత దేహం

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని పురిటిపాళెం సమీపంలో ఉన్న పంబలేరు కాలువలో గుర్తు తెలియన వ్యక్తి మృత దేహాన్ని గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 30–35 సంవత్సరాలు ఉంటాయన్నారు. నల్ల ప్యాంటు, తెలుపు, పసుపు రంగులు షర్టు వేసుకున్నట్టు వెల్లడించారు. రెండు రోజుల క్రితం మృతిచెంది ఉండొచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

తెలుగు సాహిత్యాభిలాషి

ఈమె పేరు తన్నీరు శశికళ. నాయుడుపేట పట్టణానికి చెందిన వారు. పుదూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో గణిత అధ్యాపకురాలు. ఆమె భర్త వాయుగుండ్ల సురేష్ ఉపాధ్యాయుడు. ఆమె ఉపాధ్యాయురాలిగా, రచయితగా, సాహిత్యవేత్తగా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. ముఖ్యంగా తెలుగు భాష, సాహిత్యం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. ఫిబ్రవరి 28న తిరుపతిలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు భాషా సదస్సులో తెలుగుభాషాభివృద్ధిపై శశికళ పత్ర సమర్పణ చేసి ప్రశంసా పత్రం అందుకున్నారు. 2024లో సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు అందుకున్నారు. జాబిలి తునకలు, స్వర్ణముఖి సవ్వడులు తదితర కవితలు రాశారు. పిల్లలకు కథలు, కవితలు రాయడంపై శిక్షణ ఇచ్చి రచనలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో 2017, 2022లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలుగుభాష సేవా సత్కారం అందుకున్నారు. బెంగళూరు,



తిరుపతిలో ప్రశంసా పత్రం అందుకుంటున్న తన్నీరు శశికళ(ఫైల్)

మదురై వర్సిటీల నుంచి అవార్డులు అందుకున్నారు. 2024లో ఆచార్య దేవోభవ జాతీయ స్థాయి అవార్డు, కలాం విజన్ అవార్డులను అందుకున్నారు. నెల్లూరులో పోతూరి మాణిక్యమ్మ స్ఫూర్తి అవార్డు, తిరుపతిలో గురుబ్రహ్మ అవార్డు, గణిత పరికరాల ప్రదర్శనలో ఎస్సీఈఆర్టీ వారు రాష్ట్ర స్థాయిలో బహుమతి పొందారు. 2013, 2017లో ఆగస్టులో 15న ఉత్తమ సేవా అవార్డులు పొందారు. 2015, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, 2017లో సావిత్రి బాయి పూలే అవార్డులు అందుకున్నారు. – నాయుడుపేట టౌన్



రైతు పక్షపాతి

ఈమె పేరు బి.మునిచందన. వెంకటగిరికి చెందిన వారు. ఆమె భర్త ఉపాధ్యాయుడు. రాపూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె రాపూరు బ్యాంకు బ్రాంచ్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అలాగే బ్యాంకులో పలువురు రైతులకు పంటల రుణాలు ఇవ్వడంతోపాటు రుణాల రికవరీలో ముందున్నారు. ఎరువులు సకాలంలో అందజేస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. లావాదేవీలను పెంచి నష్టాల్లో వున్న బ్యాంకును లాభాల బాటలో నడిచేలా చర్యలు తీసుకున్నారు. బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ మేనేజర్ అవార్డుకు ఎంపిక చేసింది. ఆమె నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు చేతుల మీదుగా జిల్లా స్థాయి బెస్ట్ మేనేజర్ అవార్డు తీసుకోనున్నారు. ఆమె



బ్యాంకింగ్ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మునిచందన

వెంకటగిరి సహకార బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. – సైదాపురం

క్లుప్తంగా

సీహెచ్‌సీలో పేదలకు అందని వైద్యం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని సీహెచ్‌సీలో పేదలకు వైద్యం అందడం లేదని 14వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరిశంకరయ్య ఆరోపించారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. డాక్టర్లు, మందులు కొరత ఉందన్నారు. వైద్యులు ఇక్కడి నుంచి తిరుపతికి రెఫర్ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు సీహెచ్‌సీని తనిఖీ చేసి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోట: మండలంలోని వల్లిపేడు పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల మహిళలకు శుక్రవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి జె.దినేష్ తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు చేసినట్టు వెల్లడించారు. స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, పద్మావతి, సూపర్‌వైజర్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

12న రుణాలకు ఇంటర్వ్యూలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో వివిధ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి 12న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకురావాలని కోరారు.

శని, ఆదివారాలు ఇంటి పన్నులు చెల్లించవచ్చు

రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు అయినప్పటికీ ఇంటి పన్నులు చెల్లించే అవకాశం కల్పించినట్టు కమిషనర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పన్నులు కట్టించుకుంటామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నివాళి



నందగోపాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : చవటకండ్రిగ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కగారిపేటకు చెందిన నందగోపాల్(22) తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గ్రామానికి చేరుకున్నారు. నందగోపాల్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దొరువులతో ఆదరవు

సాగునీరు పుష్కలంగా ఉంటే రైతులు ఏదో ఒక పంట సాగుచేసుకుని సంతోషంగా జీవనం సాగిస్తారు. తీర ప్రాంతాల్లో సాగునీటి వనరులు లేకపోయినా రైతులు ఆందోళన చెందలేదు. ఇసుక భూముల్లో దొరువులను తవ్వి అందులోని నీటితో వేరుశనగను పండిస్తున్నారు. చిల్లకూరు మండలంలోని 15 గ్రామాల్లో దొరువులను ఆదరువు చేసుకుని స్ప్రింక్లర్లను ఏర్పాటుచేసుకుని సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వేరుశనగను సాగు చేసుకుంటున్నారు.



తీర ప్రాంతంలో ఇసుక భూముల్లో ఏర్పాటు చేసుకున్న దొరువు

- తీర గ్రామాల్లో సాగునీటికి దొరువులే ఆధారం
- వెయ్యి ఎకరాలకుపైగా వేరుశనగ సాగు

చిల్లకూరు : మండలంలోని చింతవరం, ఏరూరు, అద్దెపల్లి, బల్లవోలు, తూర్పుకనుపూరు, వేళ్లపాళెం, కొత్తపాళెం, వరగలి, మోమిడి, కొమారవారిపాళెం, మన్నేగుంట, తమ్మిన పట్నం, లింగవరం, పునుగుంటపాళెం, నర్రావారిపాళెం గ్రామాల్లో సాగునీటి వనరులు లేవు. బోరు బావులే దిక్కు. వేసవి కాలం వచ్చిందంటే నీరు అడుగంటి పంటల సాగు గగనంగా మారుతోంది. ఈ క్రమంలో రైతులు కొంత ఆలోచన చేశారు. చెలమల నుంచి తాగునీరు తెచ్చుకునే విధానాన్ని గుర్తు చేసుకున్నారు. దొరువులు తవ్వకం చేపట్టారు. అందులో నుంచి వచ్చే నీటిని సాగుకు వినియోగించడం మొదలుపెట్టారు. ఇసుక కలిసిన సిలికా భూములకు ఒండ్రు మట్టిని తోలుకుని అందులో వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. పంటకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో ఏడాదికి మూడు పంటలు సాగుచేస్తూ ఆదాయం పొందుతున్నారు.



స్ప్రింక్లర్లతో పంటకు అందిస్తున్న నీరు

25 సెంట్ల భూమిలో దొరువుల తవ్వకం

ఇసుక భూముల్లో నిల్వ ఉండే నీటిని ఒక్క చోటకు చేర్చే ప్రకియలో భాగంగా ఒక్కొక్క రైతు తను సాగు చేస్తున్న భూమికి సమీపంలో 25 సెంట్లలో దొరువులను తవ్వించుకున్నారు. ఇందులో ఉండే నీటి ఊటను ఆయిల్ ఇంజిన్లు, సోలార్ సిస్టమ్‌తో తోడుకుని స్ప్రింక్లర్ల సాయంతో పంటకు అందిస్తున్నారు. దీని వల్ల నీటి తడులు తక్కువ కావడమే కాకుండా రైతులకు పనిభారం కూడా తగ్గుతోంది. ఒక దొరువు తవ్వడానికి సుమారు రూ.20 వేలు ఖర్చు అవుతుంది. ఏడాది తర్వాత మళ్లీ దాన్ని తవ్వుకోవాల్సి వస్తుంది. దీనికి ఒక సారికి రూ.5 వేల వరకు అవుతుంది. దీంతో ఆ ఏడాదంతా నీరు పుష్కలంగా ఉంటుంది. ఇలా ప్రతిఏటా దొరువులను తవ్వుకుని నీటిని పంటల సాగుకు వినియోగించుకుంటున్నట్టు రైతులు చెబుతున్నారు.

దొరువులు లేకపోతే సాగు చేయలేం



సిలికా,(ఇసుక) కలిసిన భూముల్లో సాగు నీటికి బోర్లు కూడా ఉపయోగపడవు. ఈ క్రమంలో ఇక్కడ ప్రతి ఒక్కరూ దొరువులు తవ్వుకుని వాటిలో నిల్వ ఉండే నీటిని స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగకు అందిస్తున్నాం. ఏడాదిలో మూడు పంటలు పండించుకుంటున్నాం. దిగుబడి కూడా బాగానే వస్తోంది.
– గుడి ముత్యాలయ్య, కొమరావారిపాళెం, చిల్లకూరు మండలం

రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది



సిలికా భూముల్లో నిల్వ ఉండే నీటిని ఒక్క చోటకు చేర్చేలా దొరువులు తవ్వుకుంటాం. ఇందుకు సుమారు 10 గంటలకు పైగా జేసీబీలు పని చేయాల్సి ఉంటుంది. రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. ఏడాది తర్వాత మళ్లీ దాన్ని తవ్వుకోవాలి. లేకుంటే దొరువు పూడిపోయే ప్రమాదం ఉంది .
– ఆదిశేషయ్య, పునుగుంటపాళెం, చిల్లకూరు మండలం

నేడు అమీర్ షావలీ దర్గా కమిటీలతో చర్చలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట నడిబొడ్డున ఉన్న హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసు వేడుకల నిర్వహణపై ఇరు కమిటీలతో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించనున్నారు. అమీర్‌షావలీ ఉరుసును గతంలో దోర్నాదుల చెంచు కృష్ణయ్య కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. 2016లో వక్ఫ్ బోర్డు కమిటీ ఏర్పాటుచేయడంతో రెండు కమిటీల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. 2017 నుంచి ఉరుసుకు వేడుకలకు బ్రేక్ పడింది. ఈ క్రమంలో శనివారం ఇరు కమిటీల పెద్దలు, నాయకులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద చర్చలు జరిపి ఉరుసు నిర్వహించే తేదీలను ప్రకటించనున్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోండి

చిల్లకూరు : ఉపాధి పనులుచేసే కూలీల పేర్లను ఈ-శ్రమ్ పోర్టర్‌లో నమోదు చేసి ప్రమాద బీమా అందేలా చూడాలని శ్రీసిటీలోని కోల్‌గేట్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వారు సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధి కూలీల పేర్లను ఈ-శ్రమ్‌లో ఉచితంగా నమోదు చేయిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చిల్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమై పలు విషయాలపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలు నేరం

చిల్లకూరు : బాల్య వివాహాలు చేయడం నేరమని సీడీపీవో మహబూబీ తెలిపారు. చిల్లకూరులోని అరుంధతీయవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ముత్యాలమ్మ జాతర నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనన్

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 25 నుంచి 29 వరకు నిర్వహించనున్న జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం ఆలయ ఆవరణలోని మండపంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లతోపాటు వసతుల కల్పనపై దృష్టిసారించాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, 24 గంటలు తాగునీరు అందించాలన్నారు. జాతర జరిగే నాలుగు రోజులు సిలికా లారీలు తిరగకుండా చూడాలని రవాణాశాఖాధికారులను ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని పేర్కొన్నారు. అదనంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసులకు సూచించారు. జాతర జరిగే ప్రాంతానికి ఐదు కిలోమీటర్లలో మద్యం షాపుల నిర్వహణ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గూడూరు డీఎస్పీ గీతాకుమారి, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఈవో నవీన్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు దువ్వూరు చంద్రారెడ్డి, ఎక్సైజ్ సీఎస్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

రాపూరు/సైదాపురం/కలువాయి : మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాపూరు, సైదాపురం, కలువాయి తహసీల్దార్లు లక్ష్మీనరసింహం, రమాదేవి, శ్యామ్‌సుందర్‌రాజు తెలిపారు. వారు శుక్రవారం అధికారులతో కలిసి రాపూరు మండలంలోని రాపూరు, జోరేపల్లి, సిద్ధవరం, సైదాపురం మండలంలోని గిద్దలూరు, రామసాగరం, సైదాపురం, కలువాయి మండలంలోని తెలుగురాయపురం, వెరుబొట్లపల్లి, బద్దెవోలు, మాదన్నగారిపల్లి, కుల్లూరు, కలువాయి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రేడ్ ఏ రకం క్వింటాలు రూ.2,320లు, సాధారణ రకం క్వింటాలు రూ.2,300లకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రవాణా, హమాలీ, ప్యాకింగ్ ఖర్చులు సొసైటీ ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయని తెలిపారు. ధాన్యం అమ్ముకోవాలంటే రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాపూరు, సైదాపురం ఎంపీడీవోలు భవాని, పురుషోత్తం శివకుమార్, ఏవోలు సోమసుందర్, హైమావతి, ప్రతాప్, సొసైటీ సీఈవో పెంచలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గునపాటిపాళెం గ్రామానికి చెందిన సూర్య, నవీన్‌కుమార్ బైక్‌లో కొత్తగుంట నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అరవపాళెం రోడ్డు వద్ద నాయుడుపేట నుంచి మల్లాం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో సూర్య, నవీన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో నాయుడుపేట వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అధికారులను అడ్డుకున్న వారికి జరిమానా

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలంలోని యాతలూరులోని రిజర్వుడు ఫారెస్టు భూముల్లో జాయింట్ సర్వే చేస్తున్న ఫారెస్టు అధికారులు, పోలీసులను అడ్డుకున్న వారికి వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష శుక్రవారం జరిమానా విధించారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన యాతలూరుకు చెందిన 41 మందిపై 2011లో వెంకటగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఐదుగురు మృతి చెందారు. మిగిలిన 36 మందికి ఒక్కొరికి రూ.300ల చొప్పున జరిమానా విధించారు.

వాకాడు ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలి

కోట : కల్లుగీత కార్మికుడిని కొట్టి గాయపరిచిన వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కల్లుగీత సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం కోట సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఉప్పల వెంకటేశ్వర్లును పరామర్శించారు. కోట సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ కల్లు అమ్మకం విషయమై వీరారెడ్డిసత్రంకు చెందిన ఉప్పల వెంకటేశ్వర్లు, తిన్నెలపూడికి చెందిన రాగయ్య గొడవ పడ్డారని తెలిపారు. న్యాయం కోసం ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాట్లాడేందుకు పిలిపించిన ఎక్సైజ్ సీఐ ప్రసాద్ బాధితుడు వెంకటేశ్వర్లుని తీవ్రంగా కొట్టారని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఒక వర్గం వారికి కొమ్ము కాస్తున్నాడన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు రమణ, వేణుగోపాల్, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్లుగీత సొసైటీ నాయకులు

ఘనంగా కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగలో వున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ మహా కుంభాభిషేక ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్న ఈ ఆలయ పునరుద్ధరణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య రూ.60 లక్షలు మంజూరు చేయించారు. టీటీడీ నుంచి రూ.23 లక్షలు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామ పెద్దలు, దాతలు కలిసి రూ.30 లక్షలకు పైగా సేకరించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేశా రు. ఈక్రమంలో కుంభాభిషేక మహోత్సవాలు చేపట్టారు. శుక్రవారం యాగశాల వద్ద శాంతి హోమం, మహా కుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ట చేపట్టారు. సా యంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించా రు. 8, 9 తేదీల్లో ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 9వ తేదీ ఉదయం 10 నుంచి మూలమూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ట చేయనున్నట్టు తెలిపారు.



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

పెళ్లకూరులో పదో తరగతి పరీక్షా కేంద్రం

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఈవో డి.సనత్ కుమార్ ఆదేశించారు. ఆయన శుక్రవారం పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 28 మంది, నెలబల్లి జెడ్పీ హైస్కూల్‌లో 28 మంది, పాలచ్చూరు జెడ్పీ హైస్కూల్‌లో 12 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారికి పెళ్లకూరులో పరీక్షా కేంద్రం ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. స్థానిక ఎంఈవో శంకరయ్య, ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్, శశికళ పాల్గొన్నారు.



పెళ్లకూరు హైస్కూల్లో డీవైఈవో సనత్‌కుమార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గూడూరు రూరల్ : రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ గీతా కుమారి హెచ్చరించారు. ఆమె శుక్రవారం నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. రూరల్ ఎస్ఐ మనోహర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఘనత జగనన్నదే



వాకాడు : మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మహిళలకు అన్ని రంగాల్లోనూ 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాకాడులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే జెమిలి ఎన్నికలు రానున్నాయని, వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించనుందని వివరించారు. వాకాడు గొల్లపాళెం గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి మామ ఈపూరు జనార్ధన్‌రెడ్డి మృతి చెందడంతో రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, మెట్టు శ్రీహరిరెడ్డి, వాకాటి రవి, శేషురెడ్డి, పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

రాపూరు: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంపీడీవో భవాని తెలిపారు. రాపూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదుపు సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీడీపీవో సునందన, ఏపీఎం రాధ పాల్గొన్నారు.

మహిళే సృష్టికి మూలం

సూళ్లూరుపేట : మహిళలే సృష్టికి మూలమని సూళ్లూరుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.వి క్టోరియా రాణి మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నా అత్యాచారాలు, వేధింపులు ఆగడం లేదన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ డి.ఉషారాణి, బి.అనూరాధ, ఎస్ యామిని శైలజ, లక్ష్మీప్రియ, ఎస్‌కే అప్సర, ఆర్.ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.